క్లుప్తంగా

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



డక్కిలిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ

డక్కిలి: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డక్కిలి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్సు బ్యాగ్‌లు, షూస్, యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి విద్యాశాఖ డీఈఓ శేఖర్, మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మండల వైస్ ఎంపీపీ గడ్డం చంద్రఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రంగినేని రాజా, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లీలా మాధవి, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు, గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, కాంప్లెక్స్ హెచ్ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గూడూరు రూరల్: గూడూరు పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పైపు లైన్‌లకు శర వేగంగా మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌లు వేములపాళెం నుంచి జెండా మాను వరకు పలు చోట్ల లీకేజీలు పడడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో పైపుల లైన్ లీకేజీలను మరమ్మతులు చేసేందుకు రెండు రోజుల సమయం పడుతున్నందున బుధ, గురువారాలలో తాగునీటిని పట్టణ ప్రజలకు అందించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రజలు కూడా పరిస్థితిని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

పోలిరెడ్డిపాళెంలో వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి తరుణ్

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలందించారు. శిబిరానికి విచ్చేసిన బీపీ, షుగర్ వంటి రోగులకు వైద్యాధికారి తరుణ్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది శివగాయత్రి, రుక్మిణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వీధుల్లో నిలిచిన వర్షపు నీరు



వీధుల్లో నిలిచిన వర్షపునీటిలో నిరసన తెలుపుతున్న దళితులు

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేట దళిత కాలనీ ప్రధాన వీధుల్లో భారీగా వర్షపునీరు వీధుల్లో నిలిచిపోవడంతో మంగళవారం కాలనీ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి దళితకాలనీ వీధులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. దీంతో కాలనీ ప్రజలు బయటకు రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలనీలో చాలా కాలంగా సీసీరోడ్లు లేక కష్టాలు పడుతున్నట్లు కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకొనేవారు లేరని, ఇప్పటికైనా కాలనీలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేమంత్, రమేష్, మోషే, పెంచలమ్మ, ఉమేష్, సందీప్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పల్లకీ సేవ



మల్లెల అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం పల్లకీసేవ నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ఆవరణలో పల్లకీలో ఉంచి ఊరేగించారు. మూలవిరాట్‌కు మల్లెల అలంకరణ గావించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా యమదిన్నెపాళెం, తూర్పుకనుపూరు గ్రామాలకు చెందిన ఇనుగుంట శోభన్, శిరీష, క్రిష్ణయ్య, సుబ్బమ్మ, లోహిత్ వ్యవహరించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్ పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా మలుపులు



కలిచేడు సమీపంలో మహంతి మైకా మైన్ సమీపంలో మలుపు



కలిచేడు-తురిమెర్ల సమీపంలో ఉన్న మలుపు

- 16 కిలోమీటర్లకు పది మలుపులు

సైదాపురం: సైదాపురం-పొదలకూరుకు వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారిపై వెళ్లాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. సైదాపురం నుంచి తలుపూరు వరకు సుమారు 16 కిలోమీటర్లు దూరం ఉంది. అడుగు అడుగునా ప్రమాదభరితంగా మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ 16 కిలోమీటర్లు వరకు ఉన్న మార్గంలో సుమారు 10 మలుపులు ఉన్నాయంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతోంది. మలుపుల వద్ద ప్రమాద సూచికలు కొన్ని చోట్ల ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు అసలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏక్షణం ఏం జరుగుతుందోనని వాహన చోదకులు హడలిపోతున్నారు. ఇక రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. ప్రతి రాత్రి ఆప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



డక్కిలి: డక్కిలి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డీఈఓ శేఖర్

డక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచికరంగా, శుభ్రంగా ఉండాలని తిరుపతి జిల్లా డీఈఓ వి.శేఖర్ అన్నారు. స్థాని క జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు తయారు చేస్తున్న వంటలను రుచి చూశారు. మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలు ఉండాలని నిర్వాహకులకు సూచించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులపై శ్రద్ధ చూపాలని తెలియజేశారు. ఆయన వెంట ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు ఉన్నారు.

డెంగీని నిర్మూలిద్దాం



వేపినాపిలో డెంగీ నివారణపై ర్యాలీ

రాపూరు: డెంగీ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రమీల రాజకుమారి అన్నారు. రాపూరు మండలం వేపినాపి గ్రామంలో మంగళవారం డెంగీ నివారణ వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలకు రావాలన్నారు. వారికి పరీక్షలు నిర్వహించి డెంగీ లక్షణాలు ఉంటే సరైన మందులు అందించి వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. జ్వరం వచ్చిందని తాత్సారం చేయవద్దన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షిస్తూ డెంగీ లక్షణాలు ఉంటే వైద్యులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుదర్శనమ్మ, వైద్యసిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన రోటరీ స్పోర్ట్స్ మీట్



బహుమతి ప్రదానం చేస్తున్న యల్లసిరి గోపాల్‌రెడ్డి, సభ్యులు

గూడూరు రూరల్: గూడూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరుగుతున్న అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ స్పోర్ట్స్‌మీట్ మంగళవారం ముగిసింది. నాలుగు మండలాల స్థాయిలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అథ్లెటిక్స్, గేమ్స్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలకు వైఎస్ఆర్ సీపీ సీఈసీ సభ్యులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, స్పోర్ట్స్ ట్రస్ట్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి స్పోర్ట్స్‌మీట్‌తో గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకుని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీపాస్ట్ గవర్నర్ కొణిదల మునిగిరీష్, కోఆర్డినేటర్ దశరథరామిరెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



మొక్కలు నాటుతున్న ఆంధ్ర మహిళ మండలి సభ్యులు

గూడూరు రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాము మొక్కలు నాటుతున్నామని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో మంగళవారం ఆంధ్ర మహిళ మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణ పరిధిలో అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. ఆయా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



బుచ్చినాయుడుకండ్రిగలో రేషన్ బియ్యం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు గ్రామాల్లో ఎండీయూ వాహనాలలో సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాలలో సరుకుల పంపిణీ గురించి గ్రామాల్లో దండోరా వేయాలన్నారు. సకాలంలో డీడీలు కట్టాలని, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను కార్డుదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులను అమ్మాలన్నారు. కార్డులోని ప్రతి ఒక్కరికి ఐదు కేజీల బియ్యాన్ని కార్డుదారులందరికీ అందించాలన్నారు. ప్రతి కార్డుదారుడికి తప్పనిసరిగా రేషన్ సరుకులు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ తల్లి హుండీ లెక్కింపు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి శ్రీపోలేరమ్మతల్లి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతకోటలోని శ్రీరామ మందిరంలో ఉదయం నుండి లెక్కింపు ప్రక్రియ కొనసాగనున్నట్లు తెలియజేశారు.

డీవీ సత్రంలో 99.25 శాతం పింఛన్ల పంపిణీ

దొరవారిసత్రం: మండల పరిధిలో 4916 మంది వివిధ రకాల పింఛన్లకుగాను మంగళవారం సాయంత్రానికి 4879 మందికి అందించామని స్థానిక ఎంపీడీఓ శివరాజు తెలియజేశారు. మిగిలిన 37 పింఛన్లకు 26 మంది మృతి చెంది ఉన్నారు. ఇందులో ఇంకా 11 పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

కండలేరులో 6.321 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.321 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో ఢీకొని హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

కోట: ఆర్టీసీ సెంటర్ వద్ద మంగళవారం డ్యూటీ నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తిపైకి ఆటో దూసుకెళ్లడంతో గాయాలయ్యాయి. రోడ్డుపై ఉన్న ఆటోను పక్కకు తీయమన్నందుకు డ్రైవర్ వంశీ వేగంగా కృష్ణమూర్తిని ఢీకొట్టి వెళ్లిపోయినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. కొత్తపాళెంకు చెందిన ఆటో డ్రైవర్ వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

క్రమశిక్షణ ఉల్లంఘించిన ఇద్దరు నేతలపై వేటు

సైదాపురం: క్రమశిక్షణ ఉల్లంఘించిన దేవరవేమూరు గ్రామానికి చెందిన ఇద్దరు నేతలపై సస్పెండ్ చేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ కట్టా మోహన్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల టీడీపీలో చేరిన ఆ ఇద్దరు నేతలు తమ పార్టీ నేతలను వ్యక్తిగతంగా విమర్శించడంతో ఈ వేటు వేశామన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యంరాజు, రాజశేఖర్‌రాజు, కేపీరాజు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సత్యవేడు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ బి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆసుపత్రిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో కలసి డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తకు సంబంధించి పోస్టర్లు విడుదల చేసి వ్యాధి లక్షణాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టల పంపిణీ

నారాయణవనం: మండలంలో షెడ్యూల్ కులాల రైతులకు ప్రకృతి వ్యవసాయానికి డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మానవాళికి, భూమికి రసాయన రహిత ప్రకృతి సేద్యం ఎంతో శ్రేయస్కరం అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా షెడ్యూల్ కులాల రైతులకు డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు, అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఏక్ పెడ్ మా కే నామ్(అమ్మ పేరుతో చెట్టు నాటుదాం) అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం చంద్రప్ప తన తల్లి పేరున ఓ మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు.

ముస్లిం మైనారిటీ నేతలకు పరామర్శ



అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్: శ్రీరామ్ నగర్‌లో నివాసం ఉంటున్న ముస్లిం మైనారిటీ నేత షేక్ అబ్దుల్‌ఖాదర్(60) మృతి చెందడంపై వారి కుటుంబ సభ్యులను మంగళవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. వైఎస్ఆర్ సీపీ ముస్లిం మైనారిటీ నేత డాక్టర్ అలీకి అబ్దుల్ ఖాదర్ సమీప బంధువు కావడంతో సంజీవయ్య వారి నివాసం వద్దకు చేరుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి అబ్దుల్ ఖాదర్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుమారుడు అబ్దుల్ గౌస్ మొహిద్దీన్, డాక్టర్ అలీలతో మాట్లాడి పరామర్శించారు. సంజీవయ్యతోపాటు వైఎస్ఆర్ సీపీ ముస్లిం మైనారిటీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహమాతుల్లా, నాయకులు చదలవాడ కుమార్, మెస్ భాస్కర్ రెడ్డి, కె.భావన్, మీజూరు బాల తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను త్వరగా అందించండి



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిట్టమూరు(చిల్లకూరు): కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు చిట్టమూరు రెవెన్యూ కార్యాలయంలో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తుందని వాటిని త్వరగా లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని అన్నారు. అలాగే ప్రజా పంపిణీ వ్యవస్థలో లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా డీలర్లు అన్ని రకాల డీడీలు తీసి రాగులు, చెక్కెర, బియ్యం సరఫరా చేసేలా చూడాలని ఆదేశించారు. అలాగే 15వ తేదిదీలోగా మండలంలో ప్రతి ఇంటికి బియ్యం అందించేలా పర్యవేక్షించాలని తహసీల్దార్‌కు సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులు, ఇబ్బంది పడకుండా ఉండేలా ఎప్పటికప్పుడు పూర్తి చేసి అందించాలని సూచించారు. అనంతరం పలు రెవెన్యూ సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస శర్మ, డీటీలు నిరంజన్‌బాబు, విజయలక్ష్మీ, ఆర్ఐ మధులత, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నేతలు

వెంకటగిరి(సైదాపురం): ప్రముఖ నేచురోపతి వైద్యుడు, వైఎస్ఆర్ సీపీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్ జన్మదినం సందర్భంగా మంగళవారం వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మస్తాన్‌యాదవ్ ట్రస్టు కార్యాలయంలో అభిమానులు సమక్షంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, రూరల్ మాజీ అధ్యక్షుడు ఆవుల గిరియాదవ్, అమ్మపాళెం, కలపాడు సర్పంచ్‌లు మస్తాన్, ప్రసాద్, నాయకులు సదారెడ్డి, కృష్ణమనాయుడు, దొరస్వామి, గున్నయ్య, రాజారెడ్డి, గుర్రం రవి, తిరుమల, మురళి, నారాయణ, బొలిగల పెంచలయ్య, వినోద్, కృష్ణయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం



ఏర్పేడు రైల్వే స్టేషన్ సమీపంలో ఆగిన రైలు

ఏర్పేడు: రెండు రోజులుగా ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం జరుగుతోంది. ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలో రెండు రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీకాళహస్తి, తిరుపతి మార్గాల వైపు వెళ్లే రైళ్లు, గూడ్స్ రైళ్లు గంటల తరబడి ఆగిపోతున్నాయి. సుదూర ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సమస్యలపై వెళ్లే ప్రయాణికులు తగిన సమయానికి గమ్యానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే రైలు ఉదయం 7 గంటలకు అంజిమేడు పంచాయతీ పరిధిలోని పోతుమానిగుంట ఎస్టీ కాలనీ గేటు వద్ద సిగ్నల్ పడకపోవడంతో ఆగిపోయింది. తిరిగి ఉదయం 7.40 గంటలకు రైలుకు సిగ్నల్ పడటంతో బయలుదేరి వెళ్లింది. 40 నిమిషాలపాటు ప్రయాణికులు రైలులో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రయాణికులు రైలు కిందికి దిగి ఏమి జరిగిందోనని ఆరా తీశారు. మరమ్మతులు జరుగుతున్నాయని తెలుసుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వేట్రాక్ మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతుండడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం జరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

గంగమ్మ శక్తిపీఠం గ్రిల్స్ ధ్వంసం



గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధ్వంసమైన గ్రిల్స్

సత్యవేడు: గుర్తు తెలియని వాహనం సోమవారం రాత్రి నడివీధి గంగమ్మ శక్తిపీఠానికి ఏర్పాటు చేసిన స్టీల్ గ్రిల్స్‌ను ఢీకొనడంతో అవి విరిగిపోయాయి. సత్యవేడు నడివీధి గంగమ్మ శక్తిపీఠం వద్ద భక్తులు పూజలు చేసుకొనేందుకు అనువుగా స్టీల్‌గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కొన్ని నెలలుగా సత్యవేడులో లారీల అధికంగా సత్యవేడు మీదుగా తమిళనాడుకు వెళుతున్నాయి. వీటితోపాటు పీవీపురం వద్ద ఉన్న క్వారీల నుంచి జల్లి, కంకర తీసుకుపోతున్న లారీలు సత్యవేడులో అధిక వేగంతో వెళుతున్నాయి. లారీల వేగానికి బాటసారులు , విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పోలీసులు వాహనాలు గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డులలో మితిమీరిన వేగంతో వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



నీళ్లతొట్టి కండ్రిగ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ కె.రవి

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో కూడిన నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ-1 కె.రవి కోరారు. నీళ్లతొట్టి కండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ మంగళవారం పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లపై ఆరా తీశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్స్‌లు బెల్టులు, మూడు జతల యూనిఫాం ఇస్తున్నట్లు తెలిపారు. అందరూ ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం తయారు చేసిన గుడ్డు, అన్నం, ఆకుకూర భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యతగా వండి వడ్డించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉషా, ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.